RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | మంగళవారం | 30.04.2024

సంపుటి : 1 | సంచిక : 301 | పేజీలు : 4 | వెల : 5/-

## సిఎంపై పిఎం సీరియస్

న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. అమిత్ షా ఫేక్ వీడియో కేసులో సీఎంతో పాటు పలువురికి సమన్లు ఇచ్చారు. మే 1న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. రిజర్వేషన్ల అంశంలో అమిత్ షా ఫేక్ వీడియోను షేర్ చేశారంటూ పలువురు కాంగ్రెస్ నేతలకు సమన్లు ఇచ్చారు. ఈ విషయంలో ప్రధాని మోదీ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి నేతలు ఫేక్ వీడియోలు వ్యాప్తి చేస్తున్నారని ఫైరయ్యారు..

# సిఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసుల నోటీసులు

### సిద్దిపేట సభలో అమిత్ షా మాట్లాడిన మాటలను వక్రీకరించారని ఆరోపణలు

- అమిత్ షా ఫేక్ వీడియో కేసులో సమన్లు
- వీడియోను తెలంగాణ కాంగ్రెస్ వీడియోను వైరల్ చేసిందని అనుమానం
- మే 1న విచారణకు హాజరు కావాలని ఆదేశాలు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పోలీసులు సమన్లు ఇచ్చారు. అమిత్ షాకు చెందిన ఓ ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ విభాగం ఆ వీడియోను బాగా వైరల్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. అమిత్ షా సిద్దిపేట సభలో వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపిస్తున్నారు. రిజర్వేషన్లు తొలగిస్తాం అన్నట్లుగా వీడియోను రూపొందించారు. ఈ వ్యవహారంపై కేంద్ర హెంమంత్రిత్వ శాఖ సీరియస్ అయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అందులో భాగంగానే ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డికి సమన్లు ఇచ్చారు. మే 1న విచారణకు హాజరు కావాలని ఆదేశించినట్లు తెలిసింది.

**అసలేం జరిగింది**

భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెబుతున్నట్టుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిజానికి అమిత్ షా అలా చెప్పలేదు. సిద్దిపేట సభలో అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడారు. వాటిని తీసేసి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు. కానీ ఆ వీడియోను ట్విస్ట్ చేసి ఎడిట్ చేసి అన్ని రిజర్వేషన్లు రద్దు చేస్తామన్నట్లుగా మార్చారు. సోషల్ మీడియాలో వైరల్ చేశారు. నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి వీడియోనే మార్ఫింగ్ చేయడంతో బీజేపీ తీవ్రంగా స్పందించింది. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు మార్ఫింగ్ చేసి, వీడియోను వైరల్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముందుగా ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తర్వాత హైదరాబాద్ సైబర్

మిగతా వార్త 2లో

# దేశాభివృద్ధి కోసం ఆలోచించే ఏకైక పార్టీ బిజెపి

- బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలింది
- మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం సరికాదు
- బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా



కొత్తగూడెం భద్రాద్రి – ప్రభాత సూర్యుడు

దేశాభివృద్ధి కోసం ఆలోచించే ఏకైక పార్టీ బిజెపి అని బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తెలిపారు. మోడీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం మూడో సారి ఏర్పాటు చేస్తామని, విపరీతమైన ఎండలో కూడా బిజెపి సభకు తరలవచ్చిన ప్రజలను చూసి నడ్డా ఆశ్చర్యపోయారు. కొత్తగూడెంలో జరిగిన బిజెపి బహిరంగ సభలో నడ్డా మాట్లాడారు. కేంద్రం పదేళ్లుగా తెలంగాణకు అన్ని రకాలుగా సాయం చేశామని, తెలంగాణకు ఇచ్చే పన్నుల వాటా మూడు రెట్లు పెరిగిందని తెలియజేశారు. ఎంపి అభ్యర్థులు సీతారాం నాయక్, వినోద్ రావు గెలుపు ఖాయమన్నారు. అయోధ్యలో వందల ఏళ్ల రామమందిరం కలను మోడీ సాకారం చేశారని ప్రశంసించారు. మోడీ ప్రభుత్వం ఎంతో ధైర్యంతో 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందని నడ్డా కొనియాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలనను కూడా చూస్తున్నామని, మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం సరికాదని సూచించారు. ఆయా పార్టీల వారసుల కోసమే ఇండియా

మిగతా వార్త 2లో

# ఆశలన్నీ ఆ నాలుగింటిపైనే



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

ఆ నాలుగు స్థానాలపై బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతోంది. కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్ రావు రంగంలోకి దిగారు. ఒకవైపు రోడ్డుషోలు, మరోవైపు సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేయడంతో పాటు యాక్టీవ్ చేస్తున్నారు. గత అసెంబ్లీలో వచ్చిన ఓట్ల శాతంను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా వివరిస్తూ కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఏ చిన్న అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వ హామీలను ప్రచార అస్త్రంగా చేసుకొని ముందుకు సాగుతున్నారు. అయినప్పటికీ ప్రజల నుంచి ఆశించిన మేర రెస్పాన్స్ రావడం లేదని నేతలు అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్‌లో బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌రావును గెలిపించడానికి కేటీఆర్, మెదక్‌లో వెంకట్రామిరెడ్డిని హరీశ్‌రావు, నాగర్‌కర్నూల్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించడానికి కేసీఆర్, కేటీఆర్ ముమ్మరంగా కృషి చేస్తున్నారు. కరీంనగర్, మెదక్‌లో కేటీఆర్, హరీశ్ రావు తమ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న పార్లమెంటు నియోజకవర్గాలు కావడం, ఇక్కడ పార్టీని గెలిపించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో మాత్రమే బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. కాంగ్రెస్‌కు 5,12,352 ఓట్లు రాగా, బీఆర్ఎస్ పార్టీకి 5,17,601 ఓట్లు, బీజేపీకి 2,50,400 ఓట్లు వచ్చాయి. మొత్తం 13,76,685 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కు 5,249 ఓట్లు మెజార్టీ వచ్చింది. అయితే ఈసారి విజయం సాధ్యమని, కేవలం తక్కువ ఓట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాలు కోల్పోయామని వివరిస్తున్నారు. కరీంనగర్‌లో పట్టు కోసం కేటీఆర్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలోని సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్ చెరువు, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్‌కు 4,20,881 ఓట్లు రాగా,

మిగతా వార్త 3లో

# కెసిఆర్‌కు అసలేమైంది ?



- సిఎంగా ఉన్నప్పుడు ఒక్క ఆట ఆడిన బిగ్‌బాస్
- పార్టీ లైన్ దాటితే చుక్కలు చూపించేటోడు
- పార్టీ నుండి ఒక్కొక్కరు జారుతున్నా మౌన ప్రదర్శన !
- పార్టీ వీడి వెళ్లేవారిని ఆపే ప్రయత్నం శూన్యం
- ఈటెలపై మంత్రి మల్లారెడ్డి రీసెంట్లీ చేసిన వ్యాక్యలపై కెసిఆర్ ఎందుకు సైలెంట్
- ఈ పరిణామాలన్నీ దేనికి సంకేంతాలు ?

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఎమ్మెల్సీ రాములు నాయక్ ని గెంటేశారు. కుంభకోణానికి పాల్పడ్డాడని అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేశారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని హెల్త్ మినిస్టర్ ఈటల రాజేందర్ పై భూకబ్జా ఆరోపణలు చేశారు. ఆయనను మంత్రివర్గం నుంచి తప్పించారు.. పార్టీ లైన్ కి వ్యతిరేకంగా ఉన్నాడని బాబూ మోహన్ కు పొమ్మన లేక పొగ పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో.. తనను, తన నాయకత్వాన్ని ధిక్కరించే ఏ వ్యక్తికైనా సరే కెసిఆర్ చుక్కలు చూపించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక ఆట ఆడుకున్నారు. పార్టీలో ఏమాత్రం తేడా అనిపించినా వెంటనే చర్యలకు ఉపక్రమించేవారు. ఎంతటి వారైనా సరే ఉపేక్షించేవారు కాదు. మరి ఇప్పుడు క్రమశిక్షణను పదేళ్లపాటు పకడ్బందీగా అమలు చేసిన కేసీఆర్.. ఇప్పుడు పార్టీపై పట్టు కోల్పోతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. నేతలు తమ వ్యవహార శైలితో లైన్ దాటుతున్నప్పటికీ కెసిఆర్ ఏమీ చేయలేకపోతున్నారు. జస్ట్ ఒక ప్రేక్షకుడిగా చూస్తుండి పోతున్నారు. అధికారం కోల్పోవడంతో కీలక నాయకులు మొత్తం కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయ్యారు. ఉన్న ఎమ్మెల్యేలలో కొంతమంది కండువా మార్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

తనకు అత్యంత సన్నిహితులైన

మిగతా వార్త 2లో

# భగభగమంటున్న సూరీడు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు



ఎండలు మండిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణంగా 40డి ఉష్ణోగ్రత అంటేనే భరించలేనంత వేడి ఉంటుంది. కానీ, తెలంగాణ రాష్ట్రంలో 45 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలకు వడగాలులు కూడా తోడవుతున్నాయి.. దీంతో ప్రజలు బయటికి వెళ్లడానికే జంకుతున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు బయటికి వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు వరకు ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. కాటన్ దుస్తులు ధరించాలని, సాధ్యమైనంతవరకు ఎక్కువ నీరు తాగాలని, కొబ్బరి బోండాలు, నిమ్మరసం, పండ్ల రసాలు సేవించాలని చెబుతున్నారు. మధుమేహ రోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎండల్లో బయటకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. ఇక గడిచిన 24 గంటల్లో తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంట, మంథని, వెలగటూరు, వీణవంక, అల్లిపూర్, ఉమ్మడి నల్లగొండ జిల్లా నిడమనూరు, మిర్యాలగూడ, మాతూర్ ప్రాంతాలలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఈ ప్రాంతాలు రెడ్ జోన్ పరిధిలోకి వెళ్లాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

మే నెలలో ఉష్ణోగ్రతలు మరింత

మిగతా వార్త 3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# వేగంగా విస్తరిస్తున్న బర్డ్ ఫ్లూ

రాంచీ - ప్రభాత సూర్యుడు

జార్ఖండ్‌లో బర్డ్ ఫ్లూ వేగంగా వ్యాపిస్తుంది. దీంతో చికెన్, కోడిగుడ్ల విక్రయంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. రాంచీలోని ప్రభుత్వ పౌల్ట్రీ ఫామ్‌లో బర్డ్ ఫ్లూ కేసులు కనిపించడంతో జార్ఖండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అదే సమయంలో, కోళ్లు, బాతులలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉందని తేలడంతో ప్రభుత్వ పౌల్ట్రీ ఫామ్ హోత్వార్‌లో 1745 కోళ్లు, 450 బాతులు సహా దాదాపు 2195 పక్షులను చంపేయాలని ఆదేశించింది. రాంచీలోని హోత్వార్‌లో ఊ5ఔ1 బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన తర్వాత రాష్ట్రం మొత్తాన్ని ప్రభుత్వం అలర్ట్ చేసింది. ప్రస్తుతం రాంచీలో కంటైన్‌మెంట్ జోన్‌ను ఏర్పాటు చేశారు. 1 కిలోమీటరు పరిధిలో ఎలాంటి కోళ్లు, బాతులు, గుడ్లు కనిపించినా.. వాటిని ఇక్కడికి తీసుకొచ్చి ధ్వంసం చేయాలని అడ్మినిస్ట్రేషన్ టీమ్ ఆదేశించింది.సాధారణ వైరస్‌ల మాదిరిగానే, ఈ వైరస్ జంతువులు, పక్షులతో పాటు మానవులకు కూడా సోకగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి, రాంచీలోని ప్రభుత్వ పౌల్ట్రీ ఫారమ్‌లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన వెంటనే, అక్కడ పనిచేస్తున్న పౌల్ట్రీ ఫామ్‌లోని 2 వైద్యులతో సహా 6 మంది ఉద్యోగులు క్వారంటైన్ చేశారు. అంతే కాకుండా పౌల్ట్రీ ఫారం పరిసర ప్రాంతాలను కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు.మరోవైపు రాంచీ నుంచి ఇతర నగరాలకు బర్డ్ ఫ్లూ వ్యాపించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. రాంచీలోని హోత్వార్ ప్రాంతంలో చికెన్, గుడ్ల అమ్మకాలను ప్రభుత్వం వెంటనే నిషేధించింది. అంతే కాకుండా కోళ్లను ఒక చోట నుంచి మరో చోటికి తీసుకురావడం, రవాణా చేయడంపై కూడా పూర్తి నిషేధం విధించింది. అదే సమయంలో చికెన్, గుడ్లు తినవద్దని వైద్యులు సూచించారు.

# దేశాభివృద్ధి కోసం ఆలోచించే ఏకైక పార్టీ బిజెపి

మొదటి పేజీ తరువాత

కూటమి ఏర్పాటు చేశారని, ఇండియా కూటమి నేతలు అనేక కుంభకోణాలకు పాల్పడ్డారని, అనేక మంది కూటమి నేతలు అవినీతి చేసి జైళ్లకు వెళ్లారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కూతురు ఢిల్లీ మద్యం కేసు కుంభకోణంలో జైల్లో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంఘవ్యతిరేక శక్తులన్నీ విజృంభిస్తాయని, కాంగ్రెస్ హయాంలో ఎక్కడ చూసినా కుంభకోణాలు, అవినీతి కనపడుతోందని నడ్డా విమర్శలు గుప్పించారు. 'గిరిజనుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థను మోడీ 11 వ స్థానం నుంచి ఐదో స్థానానికి తీసుకవచ్చారు, రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతోంది. మా పాలనలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. మేడిన్ ఇండియా ఔషధాలు ప్రపంచ దేశాలకు వెళ్తున్నాయి. ఒకప్పుడు ఫోన్లన్నీ మేడిన్ చైనా, కొరియా, జపాన్ అని ఉండేవి. మేకిన్ ఇండియా పేరుతో భారత్‌లోనే ఫోన్లు తయారవుతున్నాయి. 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ ఇస్తున్నాం, మరో ఐదేళ్లు కొనసాగిస్తాం. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కటించి ఇచ్చాం, మరో మూడు కోట్ల ఇళ్లు కటిస్తాం. పిఎం మోడీ ఎప్పుడూ పేదలు రైతుల గురించే ఆలోచన చేస్తారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికీ చికిత్స అందించాం, భవిష్యత్తులో పైపులైను ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేస్తాం" అని జెపి నడ్డా తెలిపారు.

# రేవంత్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసులు

మొదటి పేజీ తరువాత

క్రైం పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

**అసలు వీడియో షేర్ చేసిన బీజేపీ**

అమిత్ షా మాట్లాడిన అసలు వీడియోను బీజేపీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. తెలంగాణలో ముస్లింలకు ఉన్న రాజ్యాంగ విరుద్ధ రిజర్వేషన్లను మాత్రమే రద్దు చేస్తామని అమిత్ షా చెప్పారని, వైరల్ అవుతున్న వీడియోను ఎడిట్ చేశారని స్పష్టం చేసింది. ఈ ఎడిటెడ్ వీడియోపై ఏబీపీ దేశం కూడా ఫ్యాక్ట్ చెక్ చేసింది. అమిత్ షా వీడియో ఫేక్ అని నిర్ధారించింది. ఏబీపీ దేశం ఫ్యాక్ట్ చెక్ కథనాన్ని ఇక్కడ క్లిక్ చేయడం ద్వారా చేయడం చూడవచ్చు.

ఫేక్ వీడియోలపై ఢిల్లీ పోలీసులు ఆదివారం రోజున కేసు నమోదు చేశారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు విషయంలో త్వరలో దేశవ్యాప్తంగా అరెస్టులు ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. సదరు వీడియోలను షేర్ చేసిన వారిని అదుపులోకి తీసుకోవచ్చని అంటున్నారు.ఎడిట్ చేసి దుష్ప్రచారం చేస్తున్న ఇలాంటి వీడియోల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఫిర్యాదులో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. వీడియోలను ఎక్కడి నుంచి షేర్ చేశారో తెలియజేసే కొన్ని లింకులను కూడా జత చేసినట్లు తెలిపింది. బహిరంగసభ హైదరాబాద్‌లో జరిగింది కావడంతో హైదరాబాద్ లోనే మార్ఫ్ చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ హ్యాండిల్సే ముందుగా ప్రచారం చేయడంతో కాంగ్రెస్ నేతల ప్రమేయం లేదా కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రమేయం ఉంటుందని భావిస్తున్నారు. ఈ వీడియో వైరల్ అయిన తర్వాత కాంగ్రెస్ నేతలు మరితం ఎక్కువగా రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్ల రద్దుపై మాట్లాడుతున్నారు. ? కారణంగా ఇదంతా వ్యూహాత్మకంగా చేస్తున్న ఫేక్ ప్రచారంగా బీజేపీ అనుమానిస్తోంది.

# కెసిఆర్‌కు అసలేమైంది ?


మొదటి పేజీ తరువాత



నేతలు పార్టీ వీడుతుంటే.. కెసిఆర్ నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్, రంజిత్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ వంటి వారు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తే.. కనీసం వారిని ఆపేందుకు కూడా కెసిఆర్ ప్రయత్నించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.. ఇవి ఇలా ఉండగానే.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ లైన్ కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్, మాల్కాజ్ గిరి పార్లమెంట్ స్థానాలపై భారత రాష్ట్ర సమితి భారీగా ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో.. మల్లారెడ్డి ఒక్కసారిగా తన వ్యాఖ్యలతో వాటిపై నీళ్లు చల్లాడు. మీడియా ప్రతినిధులు చూస్తుండగానే మల్కాజ్ గిరి భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఆలింగనం చేసుకున్నాడు. అంతేకాదు మల్కాజ్ గిరి స్థానంలో రాజేందర్ గెలుస్తున్నాడంటూ వ్యాఖ్యలు చేశాడు. వాస్తవానికి అధికారంలో గనుక ఉండి ఉంటే.. ఇటువంటి చర్యలకు పాల్పడిన ప్రజాప్రతినిధిపై కేసీఆర్ కచ్చితంగా వేటు వేసేవారు. కానీ, ఇప్పుడు అంత సన్నివేశం ఉన్నట్టు కనిపించడం లేదు. పార్టీకి నష్టం చేకూర్చే విధంగా మల్లారెడ్డి వ్యాఖ్యలు చేసినప్పటికీ కెసిఆర్ ఎటువంటి చర్యలకు ఉపక్రమించలేదు. పార్టీకి నష్టం చేకూర్చే నాయకులపై కేసీఆర్ ఈ స్థాయిలో ఉదాసీనత ప్రదర్శించడం నిజంగా ఆశ్చర్యంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈటల గెలుస్తున్నాడని మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక దీనిపై కాంగ్రెస్ కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తోంది. బీఆర్ఎస్, బిజెపి ఒకటే అని ఎందుకు ఇది ఒక ఉదాహరణ అని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోను మిపరితంగా సర్కులేట్ చేస్తున్నారు. పాలు నీళ్లు లాగా భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ నాయకులు కలిసిపోయారని వ్యాఖ్యలు చేస్తున్నారు. మరి దీనిపై బిజెపి ఎలాంటి కౌంటర్ ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది. అన్నట్టు ఈ వ్యవహారంపై భారత రాష్ట్ర సమితి అనుకూల మీడియా మౌనాన్ని పాటించింది. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం కూడా ష్ గప్ చుప్ అన్నట్టుగా వ్యవహరించింది. ఇతర పార్టీల నాయకులు ఏం చేసినా భూతద్దంలో వెతికే గులాబీ అనుకూల మీడియా.. ఈ విషయంలో సైలెంట్ గా ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# రాజకీయ వారసత్వం కోసం

## సీనియర్ల ఆరాటం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాజకీయాల్లో వారసత్వం చాలా కామన్. ప్రతి ఎన్నికల్లో కొత్త వారసత్వం హడావుడి కనిపిస్తూ ఉంటుంది. తమ వారసులను అందలమెక్కించడానికి సీనియర్లు తెగ ఆరాటపడుతూ ఉంటారు. తమ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి పార్టీ టికెట్లు సంపాదించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తారు. అవసరమైతే రాజీనామాలు కూడా చేస్తారు. ఎలాగోలా టికెట్ సంపాదించి ఎన్నికల బరిలోకి తమ నెక్స్ట్ జనరేషన్‌ను దింపుతారు. ఈ ఎన్నికల్లో కూడా అలాంటి కొత్త తరం బరిలోకి దిగింది. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమై లేదు. ప్రతి పార్టీలో ఇలాంటి సంప్రదాయం ఉన్నది. వారసత్వ రాజకీయాలు చేయబోమని గంభీరంగా చెప్పే బీజేపీలోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తూనే ఉంది. 17 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న మన తెలంగాణలో ఇలా కొత్త తరం నాయకులు ఎక్కడెక్కడ.. ఎవరెవరు పోటీ చేస్తున్నారో చూద్దాం.ఎస్సీ రిజర్వ్ పెద్దపల్లి స్థానం నుంచి ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తున్నారు. గడ్డం వెంకటస్వామి పెద్దపల్లి నుంచి ఎంపీగా చేశారు. ఆ తర్వాత ఆయన తనయుడు గడ్డం వివేక్ కూడా ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం ఆయన చెన్నూర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. తాజాగా, ఆయన కుమారుడు గడ్డం వంశీకృష్ణను కాంగ్రెస్ టికెట్ పై పెద్దపల్లి నుంచి పోటీకి నిలిపారు.వెలిచాల జగపతి రావు కొడుకు వెలిచా రాజేందర్. ఈయన ఇప్పుడు కరీంనగర్ నుంచి కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేస్తున్నారు. 2009లో వెలిచాల రాజేందర్ పీఆర్పీ టికెట్ పై పోటీ చేసి ఓడిపోయారు. వెలిచాల జగపతి రావు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా చేశారు. 2022లో మరణించారు. నిజామాబాద్ బీజేపీ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అరవింద్ మరో సారి అదే పార్టీ నుంచి బరిలో ఉన్నారు. ఆయన తండ్రి డీ శ్రీనివాస్ పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.మల్కాజ్‌గిరి నుంచి కాంగ్రెస్ టికెట్ పై బరిలో ఉన్న సునీతా మహేందర్ రెడ్డి భర్త మహేందర్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు.చేవెళ్ల నుంచి బీజేపీ టికెట్ పై పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేవీ రంగారెడ్డి మనవడు. కేవీ రంగారెడ్డి దామోదరం సంజీవయ్య సీఎంగా ఉన్నప్పుడు డిప్యూటీ సీఎంగా చేశారు. నీలం సంజీవరెడ్డి క్యాబినెట్‌లోనూ మంత్రిగా చేశారు.నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ నుంచి బరిలో మల్లురవి కేంద్రమంత్రిగా చేసిన మల్లు అనంతరాములుకు సొంత తమ్ముడు. ఇక ఇదే నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ పై పోటీ చేస్తున్న పోతుగంటి భరత్.. పీ రాములు కుమారుడు. పోతుగంటి రాములు బీఆర్ఎస్ టికెట్ పై గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి కొడుకు భరత్‌కు టికెట్ పొందారు.నల్గొండ నుంచి కాంగ్రెస్ సీనియర్ లీడర్, మాజీ మంత్రి జానారెడ్డి కొడుకు రఘువీర్ కుందూరు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ టికెట్ పై రఘువీర్ తన రాజకీయ భవితవ్యాన్ని పరీక్షిస్తున్నారు. నల్గొండ నుంచే బీఆర్ఎస్ టికెట్ పై పోటీ చేస్తున్న కంచర్ల క్రిష్ణా రెడ్డి అన్నయ్య కంచర్ల భూపాల్ రెడ్డి. ఈయన గతంలో నల్గొండ ఎమ్మెల్యేగా చేశారు.వరంగల్ నుంచి కాంగ్రెస్ టికెట్ పై కడియం శ్రీహరి కూతురు కావ్య బరిలో ఉన్నారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు డిప్యూటీ సీఎంగానూ వ్యవహరించారు. బీఆర్ఎస్ కావ్యకు టికెట్ ఇచ్చిన తర్వాత మరీ ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు. మహబూబాబాద్ నుంచి రెడ్యా నాయక్ కుమార్తె మాలోత్ కవిత బీఆర్ఎస్ టికెట్ పై పోటీ చేస్తున్నారు. మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ కవితనే. ఇప్పుడు మరోసారి అదే పార్టీ నుంచి పోటీలో ఉన్నారు.కాంగ్రెస్ టికెట్ కోసం రసవత్తర పోరు జరిగిన ఖమ్మం నుంచి రామసహాయం రఘురామ్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈయన తండ్రి డోర్నకల్ ఎమ్మెల్యేగా చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వియ్యంకుడే. రఘురామ్ రెడ్డి తొలిసారిగా లోక్ సభ ఎన్నికల బరిలో దిగారు.

# పట్టభద్రుల నియోజకవర్గంలో పోటా పోటీ

వరంగల్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాలుగు నెలలకే లోక్ సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలతో కిందా మీదా పడుతున్న సమయంలోనే మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రభావం చూపేలా మరో ఉపఎన్నిక వచ్చి పడింది. అదే ఖమ్మం, నల్గొండ, వరంగల్, పట్టభద్రుల ఉపఎన్నిక. మూడేళ్ల క్రితం ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ స్థానం నుంచి గెలిచారు. ఆయన జనగామ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దాంతో రాజీనామా తప్పనిసరి అయింది. ఉపఎన్నిక వచ్చేసింది. కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ప్రకటించారు. ఆయన గతంలోనూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో ఉన్నారు. ఇప్పుడు ఈ స్థానంలో అభ్యర్థుల్ని ప్రకటించడానికి బీజేపీ, బీఆర్ఎస్ కసరత్తు చేస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీల బలం పరిమితంగా ఉంటుంది.విద్యావంతులు ఎవరికి నచ్చితే వారికి ఓటు వేస్తారు. గతంలో విద్యా సంస్థల అధినేత ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి.. బీఆర్ఎస్ అభ్యర్థిగా అంగ, అర్థబలాలను ఉపయోగించుకుని విజయం సాధించారు. రెండో స్థానంలో తీన్మార్ మల్లన్న, మూడో స్థానంలో కోదండరాం నిలిచారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి రేసులో కూడా లేరు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ అధికార పార్టీ హోదాలో ఉండటంతో ముందస్తుగానే అభ్యర్థిని ప్రకటించింది. గ్రాడ్యుయేట్లలో మంచి ఆదరణ ఉన్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ ను ఎంపిక చేసుకుంది. ఇక బీఆర్ఎస్ కు ఓ రకంగా ఇది సిట్టింగ్ స్థానం. తమ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామా వల్ల వచ్చిన ఉపఎన్నిక. అందుకే గెలవడం మరింత ప్రతిష్టాత్మకం. కానీ ఇప్పుడు అభ్యర్థిగా ఎవరిని దింపాలన్నది సమస్యగా మారింది. యువతలో మంచి క్రేజ్ ఉన్న నేతను దింపాల్సి ఉంటుంది. ఈ విషయంలో కొంత మంది యువనేతల పేర్లను బీఆర్ఎస్ హైకమాండ్ పరిశీలిస్తోంది. బీజేపీ నుంచి కూడా కొంత మంది నే?తలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదునల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ స్థానం ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. మే 2వ తేదీన నోటిఫికేషన్ జారీ చేస్తారు. అంటే ఆ రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అభ్యర్థులను ఆలోపు ఖరారు చేయాల్సి ఉంది. మే 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 13న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 27న పోలింగ్, జూన్ 5వ తేదీన కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. జనగామా నియోజకవర్గం నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే ఎన్నికల సంఘం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసింది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు : తమిళి సై

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ రాష్ట్రం లో ప్రచారానికి రావడం,ప్రజలని కలవడం అదృష్టం గా భావిస్తున్న... అవకాశం కల్పించిన అధిష్టనం కి ధన్యవాదాలని మాజీ గవర్నర్ తమిళిసై అన్నారు. ఎన్నికల ప్రచారం లో వీలైనన్ని ఎక్కువ స్థానాలలో ప్రచారం చేస్తాను...మెజార్టీ స్థానాలు గెలుస్తున్నాం. ఫలితాల తరవాత తెలంగాణ నుండి ఎక్కువ మంది కేంద్ర మంత్రులు గా ఉంటారు. సౌత్ చెన్నై లో హోరా హోరీ పోటీ ఉంది..కానీ గెలిచి తిరుతాను. రిజర్వేషన్ అంశం తీసివేసే ప్రసక్తే లేదు.దీని పై కేంద్రం క్లారిటీ ఇచ్చింది...తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఎమర్జెన్సీ విధించింది ఎవరు? ఆ సమయం లో బాధితురాలు నీ నేను ఎమర్జెన్సీ సమయంలో నా తండ్రిని అరెస్ట్ చేశారు అప్పుడు ఎంతో ఇబ్బంది పడ్డాము. అలాంటి పార్టీ కి రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు.

# భగభగమంటున్న సూరీడు

మొదటి పేజీ తరువాత



తీవ్రంగా ఉంటాయని, ఉత్తర, భారతదేశంలో తీవ్రమైన వేడి గాలులు వీస్తాయని చెబుతున్నారు. తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వేడి వాతావరణం ఎక్కువగా ఉందని అధికారులు అంటున్నారు. కొత్తగూడెం, హనుమకొండ, గద్వాల, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, భూపాలపల్లి, ఆసిఫాబాద్, నల్లగొండ, నాగర్ కర్నూల్, ములుగు, మంచిర్యాల, నారాయణపేట వంటి ప్రాంతాలలో అధిక వేడి ఉంటుందని తెలుస్తోంది. రాష్ట్రంలో గడచిన కొద్ది రోజులుగా 40 డిగ్రీల సరాసరి ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో రోడ్లపై నిర్మానుష్య వాతావరణం కనిపిస్తోంది. చాలామంది ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు కూడా తమ ప్రచారాన్ని ఉదయం, సాయంత్రం పూట మాత్రమే చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ వేడికి జనాలు ఒక్కరి బిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్ నెల నుంచి కొన్ని జిల్లాల్లో 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తీవ్రమైన ఎండలకు తోడు వడగాల్పులు వీస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది.దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు తెలంగాణలో నమోదవుతున్నాయి. శుక్రవారం దాదాపు 8 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటింది. గత పదేళ్లలో ఏప్రిల్ నెల చివరి వారంలో ఒకేసారి ఇన్ని కేంద్రాల్లో ఈస్థాయి ఎండలు చూడటం ఇదే తొలిసారి. 45 డిగ్రీలు దాటిన కరీంనగర్, ములుగు, నల్గొండ, జగిత్యాల, యాదాద్రి, వరంగల్, వనపర్తి జిల్లాలకు రెడ్ వార్నింగ్ జారీ చేసింది వాతావరణశాఖజమ్మికుంట-45.6, మంథని-45.2, నిడదమానురు-45.2, కోల్వాయి-45.1, మాడుగలపల్లి-45.1, మర్యాల-45.1, వీణవంక-45.1, వెల్గటూరు-45.1, భద్రాచలం-44, హైదరాబాద్-42 గా నమోదైంది..తెలంగాణలో మరో మూడు రోజులపాటు ఎండలు మండిపోనున్నాయి. వృద్దులు, పిల్లలు, వీధి వ్యాపారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. వీలయినంతవరకూ ఓర్ఎస్, చలువ చేసే ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.ఏపీలోనూ భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతోంది. ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వడగాలులు కొనసాగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఇవాళ 58 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 148 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.ఇక నిన్న ఏపీలోని నంద్యాలజిల్లా చాగలమర్రిలో 45.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. తిరుపతిజిల్లా రేణిగుంటలో 45.7, కడపజిల్లా ఖాజీపేట, పార్వతీపురంమన్యం జిల్లా సాలూరులో 45.7, విజయనగరంజిల్లా గజపతినగరం, కర్నూలుజిల్లా కోడుమూరులో 44.8, అనంతపురంజిల్లా తాడిపత్రిలో 44.4, పల్నాడుజిల్లా మాచెర్లలో 44.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది.ప్రజలు వీలైనంతవరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని విపత్తుల సంస్థ అధికారులు సూచించారు. వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# ఆశలన్నీ ఆ నాలుగింటిపైనే

మొదటి పేజీ తరువాత

బీఆర్ఎస్ పార్టీకి 6,68,955 ఓట్లు, బీజేపీకి 2,11,626 ఓట్లు వచ్చాయి. మొత్తం 14,37,897 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ 2,48,074 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే సిట్టింగ్ స్థానం కావడంతో దానిని నిలుపుకునేందుకు హరీశ్ రావు ప్రత్యేక ఫోకస్ పెట్టారు.నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో గద్వాల్, ఆలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. కాంగ్రెస్‌కు 6,39,622 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 5,34,401 ఓట్లు, బీజేపీకి 1,18,513 ఓట్లు వచ్చాయి. మొత్తం 14,00,049 ఓట్లు పోల్ కాగా బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కు 1,05,224 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయినప్పటికీ ఎస్సీ రిజర్వు కావడం, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అభ్యర్థి కావడంతో కలిసి వస్తుందని బీఆర్ఎస్ గెలుపుపై ఆశలు పెట్టుకుంది. ఈ స్థానంపై పార్టీ అధినేత కేసీఆర్ సైతం ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సమాచారం.పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీకి 6,82,033 ఓట్లు రాగా, బీఆర్ఎస్ పార్టీకి 3,74,363 ఓట్లు, బీజేపీకి 79,418 ఓట్లు వచ్చాయి. మొత్తం 12,25,768 ఓట్లు పోల్ కాగా బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కు 3,07,670 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయినప్పటికీ ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పార్లమెంటు టికెట్ ఇచ్చింది. దీంతో ఆయనకు ప్రజల్లో ఆదరణ ఉందని, ఆ అంశం కలిసి వస్తుందని భావించడంతో పాటు కేసీఆర్, కేటీఆర్ సైతం గెలుపుకోసం ప్రత్యేక వ్యూహాలు రచిస్తూ ఎప్పకటిప్పుడు కేడర్‌ను అలర్ట్ చేస్తున్నారు.

# బండి సంజయ్‌కు గుణపాఠం చెప్పాలి : కెటిఆర్

కరీంనగర్ - ప్రభాత సూర్యుడు

కరీంనగర్ లోక్ సభ పరిధిలోని కరీంనగర్ టౌన్ లో జరిగిన కార్యకర్తల సమావేశంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ..వినోద్ అన్న గెలవటం ఖాయమేనా? బండి సంజయ్ షెడ్ కు పోవటం ఖాయమే కదా? కార్యకర్తలను పోలీసులు బెదిరిస్తున్నారు. నిన్నటి దాకా గౌరవమిచ్చిన పోలీసులు ఇప్పుడు తోక జాడిస్తున్నారు. మీరు 10-12 సీట్లు మనకు ఇవ్వాలె. మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారని అన్నారు. మనం గెలిస్తే నిన్నటి దాకా తోక జాడించినోళ్లు మళ్లీ సెట్ అయితరు.కరీంనగర్ ను అభివృద్ధి చేసేందుకు గంగుల కమలాకర్ గారు చాలా కష్టపడ్డారు. గంగుల కమలాకర్ గారికి 3 వేల మెజార్టీ రావటం నాకు బాధ అనిపించింది. మనది మనమే మెజార్టీ తగ్గించుకున్నాం. ఈ విషయం చెప్తే మీరు ఏమీ అనుకోవద్దు. బీజేపోళ్లు 10 మంది కూడా ఉ ండరు. కానీ మనం వార్డుకు 3 వందల మంది వరకు ఉంటాం, కానీ ఒకరి పేరు చెబితే ఒక్కరికి కోపం. అలా ఉ ండొద్దు. తల్లి లాంటి పార్టీ ని కొంతమంది లీడర్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి ఒక్క సీటు రాదంటున్నాడు. రెండు సీట్లు గెలిస్తే రాజీనామా చేస్తానని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అంటాడు. వినోదన్న గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంట అని బండి అంటాడు. మన వినోదన్నను గెలిపించి బండి రాజకీయ సన్యాసం తీసుకునేలా చేయాలి. సిరిసిల్ల, హుజురాబాద్ మంచిగనే ఉన్నాయి. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండిలో బలంగా ఉండాలె. బడా భాయ్ చాలా హామీలు ఇచ్చి మోసం చేసిండు. ఇటు చోటా భాయ్ కూడా నోటికి ఎంత వస్తే అంత చెప్పి మోసం చేసిండు. కాంగ్రెస్ క్యాండిడేట్ ను గీతా భవన్ చౌరస్తాలో నిలబడితే ఒక్కడన్న గుర్తుపడుతాడా? కరీంనగర్, నిజామాబాద్, మల్కాజ్ గిరి, చేవేళ్ల లాంటి ప్రాంతాల్లో బీజేపీ కోసం కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను పెట్టింది. కాంగ్రెస్ కోసం బీజేపీ డమ్మీ అభ్యర్థులను పెట్టిందని అన్నారు. తల్లి లాంటి పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ బీజేపీ ఒక్కటైతున్నయ్. అందుకే మీరంతా 13 రోజుల పాటు కష్టపడాలె. ఎందుకు గులాబీ జెండా పార్లమెంట్ లో ఉండాలని కొందరు ప్రశ్నిస్తున్నారు వాళ్లందరికీ నేను ఎందుకు పార్లమెంట్ లో గులాబీ జెండా ఉండాలో చెప్తా. హైదరాబాద్ ను కేంద్ర పాలితం చేస్తారని నాకు కచ్చితంగా సమాచారం ఉంది. రాముడు కూడా రాజధర్మం పాటించాలని చెప్పిండు. మరి ఈ ప్రాంతానికి బండి సంజయ్ తన రాజధర్మాన్ని పాటించి చేయాల్సి పని చేయలేదు. కరీంనగర్ కు రూపాయి తేలేదు. ఒక్క శిలాఫలకం వేయలేదు.రాముడిని అడిగితే కూడా కచ్చితంగా బండి సంజయ్ ను ఓడించమని చెప్తుతాడు. బీజేపీ రాకముందే దేవుళ్లు ఉన్నారు. బీజేపీ ఓడిపోతే దేవుళ్లకు అయ్యేది లేదు. దేశాన్ని నాశనం చేస్తున్న బీజేపీని ఓడిస్తే దేవుళ్లు కూడా సంతోషిస్తరు. దేవున్ని అడ్డం పెట్టుకొని ఎవరైతే రాజకీయాలు చేస్తారో వాళ్లకు బుద్ధి చెప్దాం. ప్రశ్నలు అడగకుండా గాలి తిరుగుడు తిరిగే బండి సంజయ్ కు గుణపాఠం చెప్పాలె. ఇంటింటికి తిరిగి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలనని అన్నారు.

# మెట్రో కారిడార్‌లో స్కై వాక్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరం కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరనుంది. హైదరాబాద్ నగరానికి కంఠాభరణం గా ఉన్న మెట్రో రైల్ మరింత విస్తరించేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ఇప్పటివరకు కొన్ని ప్రాంతాలను మాత్రమే కలుపుతోంది. అయితే దీనిని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. పాతబస్తీ ప్రాంతానికి కూడా మెట్రో సౌకర్యం కల్పించేందుకు ఇటీవల పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ విస్తరణలో భాగంగా నాగోల్ నుంచి చాంద్రాయణ గుట్ట మీదుగా మెట్రో స్టేషన్లు, రైల్వే లైన్ నిర్మిస్తారు. సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఈ మార్గం ఉంటుంది. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయినట్టు తెలుస్తోంది. మెట్రో స్టేషన్ నిర్మాణానికి సంబంధించి మూసీ నది వద్ద ఎదురయ్యే సవాళ్లను అధికారులు పరిశీలించారు. ఎల్బీనగర్, బైరామల్ గూడ వద్ద వంతెనలు నిర్మించనున్నారు.నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వెళ్లే మార్గంలో నిర్మించే మెట్రో స్టేషన్ ను ఎల్బీనగర్ వైపు నిర్మిస్తారు. ప్రయాణికుల సౌకర్యార్థం నాగోల్, ఎల్బీనగర్ స్టేషన్లో కలుపుతూ స్కై వాక్ నిర్మిస్తారు. నాగోల్ స్టేషన్ అనంతరం మూసీ నదిపై నిర్మించే వంతెన పై ఆనుకొని ఉన్న పెద్ద పెద్ద తాగునీటి పైపులు, భూగర్భంలో హై టెన్షన్ విద్యుత్ తీగలు ఉన్న నేపథ్యంలో.. అలైన్మెంట్ మరో పది మీటర్లు ఎడమవైపుకు జరుపుతారు.. మూసి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పొడవైన స్పాన్లతో పెద్దపెద్ద వంతెనలు నిర్మిస్తారు. కొత్తపేట జంక్షన్ నుంచి వచ్చే రోడ్డుకు అనుసంధానంగా చుట్టుపక్కల ఉన్న ప్రజల అవసరాల దృష్ట్యా అదనపు స్టేషన్ ను నిర్మిస్తారు. నాగోల్ ఆర్టీవో స్టేషన్, అల్కాపురి జంక్షన్ మధ్యలో విశాలమైన స్కైవాక్ నిర్మిస్తారు. కామినేని ఆసుపత్రి స్టేషన్ తర్వాత, ఎల్బీనగర్ జంక్షన్ కు దగ్గర్లో అండర్ పాస్, రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణాలలో అనేక సవాళ్లు ఎదురు కానున్నాయి. ఎల్బీనగర్ జంక్షన్ కుడివైపున ఉండే కొత్త స్టేషన్ ను మెట్రో కారిడార్ -1 లోని పాత స్టేషన్ ను స్కై వాక్ తో అనుసంధానిస్తారు. బైరామల్ గూడ, సాగర్ రోడ్డు పై భారీ ఫ్లై ఓవర్ ఉన్న నేపథ్యంలో.. విమానాశ్రయానికి వెళ్లే మెట్రో లైన్ ఎత్తును మరింత పెంచనున్నారు.మరోవైపు బైరామల్ గూడ, సాగర్ రోడ్డు జంక్షన్ మెట్రో స్టేషన్ ఎత్తు తగ్గించేందుకు, మెట్రో అలైన్మెంట్ ఫ్లైఓవర్లను ప్రభుత్వం కుడివైపు నిర్మించనుంది. అలా అలైన్మెంట్ మార్చిన తర్వాత ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో మెట్రో స్టేషన్ నిర్మిస్తారు. మైత్రి నగర్, కర్మాన్ ఘాట్, చంపాపేట జంక్షన్, ఓవైసీ హాస్పిటల్, డిఆర్డిఓ, హఫీజ్ బాబా నగర్ వంటి ప్రాంతాలలో మెట్రో స్టేషన్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇవే కాకుండా చాంద్రాయణగుట్టలో ఫ్లై ఓవర్ నిర్మించనుంది. అక్కడ ఇంటర్ చేంజ్ విధానంలో మెట్రో స్టేషన్ నిర్మించనుంది. నాగోల్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు అనేక ఫ్లై ఓవర్లున్నాయి. కొన్ని ప్రాంతాల్లో జాతీయ రహదారి కూడా వెళ్తోంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆస్తులను సేకరించి, మెట్రో స్టేషన్ల నిర్మాణానికి అనుగుణంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

# కాంగ్రెస్,బీఆర్ఎస్‌లు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు



మల్కాజ్‌గిరి - ప్రభాత సూర్యుడు

చెంగిచెర్ల, శివ దుర్గ కాలనీలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్న ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గత ఎంపీ రేవంత్ రెడ్డిని ఐదేళ్లు క్రితం ప్రశ్నించే గొంతు అని ప్రజలు భావించి పార్టీ బలహీనంగా ఉన్నా ఓట్లు వేసి, గెలిపించారు. కానీ ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను చూడడానికి గానీ, సమస్యలు తెలుసుకోవడానికి ఆయన ఒక్కసారి కూడా రాలేదు. ఇప్పుడు ఆయన ఏకంగా తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యాడు. కానీ ప్రభుత్వం ఏర్పాటయ్యి నాలుగు నెలలైనా ఇచ్చిన ఏ హామీలను నెరవేర్చలేదు. కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో బీఆర్ఎస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే చెత్త బుట్టలు వేసినట్టే అన్నారు. తెలంగాణలోని ఉద్యోగ అవకాశాలు, ఐటీ అభివృద్ధి, రోడ్లు, కార్యాలయాలు రావాలంటే బీజేపీ పార్టీ వల్లనే సాధ్యం అని దేశంలో మళ్ళీ వచ్చేది బిజెపి ప్రభుత్వం అన్నారు. నేను నేరుగా ప్రధాని మోదీ వద్దకు వెళ్లి ఈ ప్రాంతంలోని సమస్యల పై నేరుగా చర్చించగలను. మీరందరూ విజ్ఞులు, బాగా ఆలోచించి మీ ఓటును కమలం పువ్వు గుర్తుపై వేసి గెలిపించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విద్య సాగర్, అమరేంద్ర రెడ్డి, కప్పురా ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, గౌనె శ్రీనివాస్, మహేష్, పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## కేసీఆర్ ఖచ్చితంగా జైలుకు పోతాడు

మునుగోడు – ప్రభాత సూర్యుడు

మద్యం కుంభకోణంలో కవిత జైలుకెళ్ళిందని రానున్న రోజుల్లో కాలేశ్వరం అవినీతి పై ధరణి కుంభకోణం పై కేసీఆర్ కేటీఆర్ కచ్చితంగా జైల్లోకి వెళ్తారని, కెసిఆర్ అనాలోచనల వల్లనే ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రం గా మిగిల్చారు అని ఎంఎల్ఏ రాజగోపాల్ రెడ్డి అన్నారు మునుగోడు నియోజకవర్గం లో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ముఖ్యనేతల భారీ చేరికలు, చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్లు ఆరుగురు నారాయణపురం మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బిఆర్ఎస్ ముఖ్య నేతలు,సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో కి చేరికలు జరిగాయి ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేశారు.. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మరియు సాధారణ ఎన్నికల్లో కూడా ఫోన్ ట్యాపింగ్ చేశారు దీనికి బాధ్యులైన వారు కచ్చితంగా శిక్ష అనుభవిస్తారు... ప్రజల్లో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంది నాలుగు నెలల క్రితం రాష్ట్రంలో ఎలాగైతే అధికారం ఇచ్చారు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కచ్చితంగా 14 ఎంపీ సీట్లు గెల్చుకొని తీరుతామని భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు.

## సవాళ్ల మధ్యలోకి బండి

కరీంనగర్ – ప్రభాత సూర్యుడు



పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో సవాళ్లపర్వం పీక్ స్టేజ్‌కు చేరుతోంది. ఇప్పటికే.. బీఆర్ఎస్–కాంగ్రెస్ మధ్య సవాళ్లు హోరాహోరీగా కొనసాగుతుండగా.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కూడా ఎంట్రీ ఇచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్.. అమలు చేసినట్లు నిరూపిస్తే తాను పోటీ నుంచి తప్పుకుంటానని బండి సంజయ్ ప్రకటించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుని.. కాంగ్రెస్ తరపున ప్రచారానికి సిద్ధమన్నారు. తన సవాల్‌ను స్వీకరించే దమ్ము కాంగ్రెస్ నేతలకు ఉందా అని ఛాలెంజ్ విసిరారు బండి సంజయ్. అరు గ్యారెంటీలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మహిళలకు నెలకు రూ. 2500 బ్యాంకు అకౌంట్లలో వేస్తామన్నారు. వాటిని ఏ ఒక్క మహిళల ఖాతాలోనైనా వేసినట్లు నిరూపించండని డిమాండ్ చేశారు. అలాగే ఆసరా పెన్షన్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ. 4000 అకౌంట్లలో వేస్తామన్నారు. అలా ఈ పథకం ఏ ఒక్కరికైనా అందించినట్లు చూపించమని కోరారు. ఈ రెండింటినీ నిరూపిస్తే తాను కరీంనగర్ ఎంపీగా పోటీ నుంచి తప్పుకుంటానని చెప్పారు.ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కీలక నేత మాజీ మంత్రి హరీష్ రావు కూడా తన రాజీనామా లేఖను గన్ పార్క్ వద్ద ప్రదర్శించారు. ఆగస్ట్ 15లోపు రైతుల రూ. 2లక్షల రుణాలు మాఫీ చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ చేయలేకపోతే సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. దీనిపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. రాజీనామా లేఖ స్పీకర్ ఫార్మెట్లో లేదని, అది చెల్లదని కౌంటర్ వేశారు. ముఖ్యమంత్రి రేవంత్ కూడా రాజీనామా లేఖ జేబులో పెట్టుకో అని ఎద్దేవా చేశారు. ఇలా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయం రసవత్రంగా మారింది.

## బీబీ పాటిల్ వాహనంలో నగదు స్వాధీనం

మెదక్ – ప్రభాత సూర్యుడు

జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ కాన్వాయ్ వాహనంలో నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టెక్మాల్ (మం) బొడ్మాట్ పల్లి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేసారు. బీబీ పాటిల్ కాన్వాయ్ వాహనంలో 1 లక్ష 60 వేల నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు, నగదు అమౌంట్ ను సీజ్ చేసారు.

## నేడే తెలంగాణ 10వ తరగతి పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ 10వ తరగతి పరీక్షా ఫలితాలు రేపు(మంగళవారం) విడుదల కాబోతున్నాయి. రేపు ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలు ఆన్ లైన్ లో విడుదల కాబోతున్నాయి. 10వ తరగతి ఫలితాల విడుదలకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పదో తరగతి పరీక్షల ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.

## జేఈఈ అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ – ప్రభాత సూర్యుడు

దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) ప్రకటన వెలువరించింది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో అభ్యర్థులు ముమ్మరంగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసే పనిలో పడ్డారు. ఈ ఏడాది రెండు సార్లు నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో పరీక్షలలో నిర్ణీత కటాఫ్ పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. మే 7వ తేదీతో దరఖాస్తులు ముగుస్తాయి. చివరి తేదీ వరకు నిరీక్షించకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీయే సూచించింది. మే 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరణకు అవకాశం ఉంటుంది.తొలుత నిర్ణయించిన ప్రకారం ఏప్రిల్ 21 నుంచి 30 వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరగవల్సి ఉంది. అయితే కొన్ని కారణాల రిత్యా షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు ఐఐటీ– మద్రాస్ ప్రకటించింది. అయితే పరీక్ష తేదీలో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. తొలుత ప్రకటించిన విధంగానే జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 పరీక్ష మే 26వ తేదీన యథావిధిగా నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రాసేందుకు 2.5 లక్షల మందికి మాత్రమే అర్హత ఉంటుంది. జేఈఈ మెయిన్ సెషన్ 1, 2లకు కలిపి మొత్తం 24 లక్షల మంది ఈ ఏడాది పోటీ పడిన సంగతి తెలిసిందే.దరఖాస్తు ఫీజు చెల్లింపులు మే 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఇచ్చారు. అడ్మిట్ కార్డులు మే 17 నుంచి 26 వరకు వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచుతారు. మే 26వ తేదీన ఉదయం పేపర్ 1 పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. మధ్యాహ్నం సెషన్‌లో పేపర్ 2 పరీక్ష 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఇక మే 31న రెస్పాన్స్ షీట్లు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రైమరీ ఆన్సర్ కీ జూన్ 2న విడుదల చేస్తారు. ఆన్సర్ కీపై అభ్యంతరాల స్వీకరణ అనంతరం జూన్ 9న ఉదయం 10 గంటలకు ఫలితాలతోపాటు ఫైనల్ ఆన్సర్ 'కీ' కూడా విడుదల చేస్తారు. ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రిజిస్ట్రేషన్ జూన్ 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. జూన్ 10 నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభంకానుంది.

## గ్రాడ్యుయేట్స్ కోసం బీజేపీ కసరత్తు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పైన బిజెపి కసరత్తు ప్రారంభించిందా? ఆశావాహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారా? అభ్యర్థి ఎవరైతే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయో బిజెపి లెక్కలు వేస్తుందా? గతంలో నాలుగో స్థానంలో ఉన్న బిజెపి ఈసారి గెలవడానికి ఎలాంటి ప్రణాళికన రూపొందిస్తుంది? పార్టీ వర్గాల్లో ఎలాంటి చర్చ జరుగుతుంది? వాచ్ దిస్ స్టోరీ.పట్టభద్రుల నియోజక వర్గం ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల అయింది.. కమలం పార్టీ నుండి అభ్యర్థి ఎవరు అనే చర్చ జరుగుతుంది... గ్రాడ్యుయేట్ లో బీజేపీ పట్టు ఉందనే ఉద్దేశ్యం తో పలువురు బీజేపీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు సమాచారం. వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజక వర్గ ఉప ఎన్నికకు షెడ్యూల్ వచ్చింది.... మే 27 న ఎన్నిక జరగనుంది... పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే గా ఎన్నికైన తరవాత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడం తో ఉప ఎన్నిక వచ్చింది .. ప్రధానంగా మూడు పార్టీలు ఈ సీటు ను కైవసం చేసుకునేందుకు ప్రయత్నం చేసుకుంటున్నాయి... కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థి నీ ప్రకటించింది... కమలం పార్టీ నుండి అభ్యర్థి ఎవరు అనే చర్చ జరుగుతోంది...గత ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమెందర్ రెడ్డి పోటీ చేశారు.... బీజేపీ నాలుగో స్థానం లో నిలిచింది... ఈ సారి చాలా మందే పోటీ పడుతున్నారు... వాతావరణం బాగుందని భావిస్తున్నారు ఆశావహులు....గత ఎన్నికల్లో పోటీ చేసిన ప్రేమేందర్ రెడ్డి ఈ సారి కూడా తనకే టికెట్ ఇవ్వాలని అడుగుతున్నారని తెలుస్తుంది... మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కూడా టికెట్ ఆశిస్తున్నారని పార్టీలో చర్చ జరుగుతుంది... టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారనీ పార్టీ వర్గాలు అంటున్నాయి... ఇక మరో బిజెపి సీనియర్ నేత రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి కూడా టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు.... పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో విస్తృతంగా



పాల్గొన్నారు...ఓటర్ల నమోదు ను కూడా స్వయంగా చెపించుకున్నారు... వీరితో పాటుగా పార్టీ ఆదేశిస్తే పోటీ చేయడానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి సిద్ధమంటుందట... ముఖ్యంగా గత గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈవెం పోటీ చేశారు కూడా...కాబట్టి ఆ నియోజకవర్గాల్లో విస్తృతంగా ఓటర్లను కలిసినందున... ఈసారి పార్టీ ఆదేశిస్తే తాను కూడా పోటీ చేస్తానని తన సన్నిహితులతో రాణి రుద్రమదేవి చెప్పినట్లు సమాచారం...వీరితో పాటుగా స్థానిక నేతలు కూడా ఆశపడుతున్నరని తెలుస్తుంది...బీజేపీ నేతలే కాదు ఒకరిద్దరు విద్యా వేత్తలు కూడా సీటు అడుగుతున్నారని తెలుస్తుంది... విద్యా సంస్థల అధినేత ఎవియన్ రెడ్డి పార్టీ లో చేరి టీచర్ ఎమ్మెల్సీ గా పోటీ చేసి గెలవడం తో వరంగల్ కు చెందిన విద్యా సంస్థల అధినేత లు కన్నేసినట్లు ప్రచారం జరుగుతుంది....ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించి కథనరంగంలోకి దిగగా... ఇక బిజెపి కూడా అభ్యర్థి అన్వేషణలో పడింది... బలమైన అభ్యర్థి కోసం పార్టీ కసరత్తులు చేస్తుంది.. టికెట్ ఆశిస్తున్న నేతలకు పార్టీ జై కొడుతుందా లేక కొత్తగా ఎవరినైనా బిజెపి తెరమీదకి తీసుకొస్తుంది వేచి చూడవలసిందే.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై భూకబ్జా,అవినీతి కేసులు

వరంగల్ – ప్రభాత సూర్యుడు



తనపై సంచలన వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కౌంటర్ ఇచ్చారు. బస్సు యాత్రలో భాగంగా వరంగల్ రోడ్డులో కేసీఆర్ తనను టార్గెట్ చేసి మాట్లాడారని.. తాను ఎవర్నీ మోసం చేయలేదని, అయితే వరంగల్ ప్రజలతో పాటు, యావత్ తెలంగాణ ప్రజల్ని మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ అంటూ కడియం శ్రీహరి మండిపడ్డారు. కడియం శ్రీహరి మోసగాడు అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కడియం ఘాటుగా స్పందించారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా చేసిన వారిపై ఎన్నో రకాల అవినీతి కేసులు ఉన్నాయని ఆరోపించారు. కేసీఆర్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా చేసిన వారిపై భూకబ్జా, అవినీతి, ఫోన్ ట్యాపింగ్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశాడని, కాకతీయులు మాకు ఇచ్చిన వారసత్వాన్ని ముక్కలు ముక్కలు చేశారని కడియం మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దయనీయ పరిస్థితులను తీసుకువచ్చింది కేసీఆర్ అని కడియం శ్రీహరి అన్నారు. 3 నెలల్లో ఏదో అద్భుతం జరుగుతుందని కేసీఆర్ అంటున్నాడని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఒక్క సీటు కూడా గెలవకుంటే కేసీఆర్ పార్టీ బీఆర్ఎస్ మూతపడబోతుంది కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు.లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని.. బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం అవుతుందని సెటైర్లు వేశారు. మాజీ సీఎం కేసీఆర్ తనపై విమర్శలు చేయడం మానుకొని పార్టీని కాపాడుకునే పని చేస్తే బెటర్ అని సలహా ఇచ్చారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మీద సరైన ఆధారాలు ఉన్నాయి కనుక అధికారులు ఆమెను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని కడియం అన్నారు. కవిత వల్ల ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆగమయ్యాడని కడియం అన్నారు. కేసీఆర్ వరంగల్ పార్లమెంట్ స్థానంలో ప్రజలకు సంబంధం లేని వ్యక్తిని తీసుకువచ్చి అభ్యర్థిగా పెట్టాడని.. దాని వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదన్నారు.

### నన్ను తిట్టడానికే రాజయ్యను వాడుతున్న కేసీఆర్!

కడియం శ్రీహరిని తిట్టడానికి రాజయ్యను ప్రత్యేకంగా కేసీఆర్ జీతానికి పెట్టుకున్నాడని కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. తనకు శత్రువైనా, వరంగల్ బీఆర్ఎస్ టిక్కెట్ రాజయ్య లాంటి వాడికి ఇస్తేనే ఇక్కడ బిఆర్ఎస్ పార్టీ బతికేదని కడియం అన్నారు. బీజేపీని గెలిపించదానికే కేసీఆర్ డమ్మీ అభ్యర్థిని పెట్టాడన్నారు. వరంగల్ మాస్టర్ ప్లాన్ కోసం 10 సార్లు కేసీఆర్ ను ప్రాధేయపడ్డానని చెప్పారు. వరంగల్ కు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదు రింగ్ రోడ్డు లేదన్నారు. వరంగల్ అంటే కేసీఆర్ కు కోపం, వ్యతిరేకత అని ఇక్కడ ప్రశ్నించే వాళ్ళు ఎక్కువగా ఉంటారనే భయం కేసీఆర్‌కు ఉందని కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు అమిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎఐసిసి ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో అమిత్ కాంగ్రెస్‌లో చేరారు. ఎఐసిసి కార్యదర్శ రోహిత్ చౌదరి, డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో కలిసి అమిత్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో తన అమిత్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి రేవంత్ ఆహ్వానించారు. బిఆర్ఎస్ సీనియర్ నేత, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సైతం గత కొంత కాలంగా పార్టీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారు. నల్లగొండలో గుత్తా సుఖేందర్– జగదీశ్ రెడ్డి మధ్య కోల్డ్ వారు నడుస్తోందని పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గుత్తా ఫ్యామిలీ కాంగ్రెస్ గూటికి వెళుతుందని ప్రచారం జరిగింది. ఇప్పుడు అమిత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడంతో అది నిజమైంది.

## దేశంలోని పలు ప్రధాన ఎయిర్‌పోర్ట్సుకు బాంబు బెదిరింపులు

న్యూ డిల్లీ – ప్రభాత సూర్యుడు

దేశంలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. ఇవాళ దేశంలోని పలు ప్రధాన ఎయిర్‌పోర్ట్సుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆయా విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.సోమవారం ఉదయం రాజస్థాన్‌లోని జైపూర్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్ , గోవా విమానాశ్రయాలకు ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వెంటనే ఆయా విమానాశ్రయాల అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో ఆయా విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే, ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు కనిపించలేదని పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు బెదిరింపు మెయిల్స్ నేపథ్యంలో ఆయా విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈమెయిల్ పంపిన వారి కోసం గాలిస్తున్నారు. అయితే, ఆయా విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు ఎలాంటి అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. కాగా, దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా చెన్నై, ముంబైలోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు, పలు విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఇలా దేశంలోని పలు పాఠశాలలు, ప్రముఖ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి వరుస బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST / HYDERABAD CITY,TELANGANA.**EDITOR: CHERUKU UPENDAR** PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. **EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215**